# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **దేశ సమైక్యత కోసం 'ఒకే దేశం ఒకే ఎన్నిక'ను అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

**3.** **వరదల కారణంగా దెబ్బతిన్న వాహనాలకు సంబంధించిన బీమా చెల్లింపు ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**4.** **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో పర్యటించనున్నారు.**

**5.** **దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.**

==========================

దేశ సమైక్యత కోసం 'ఒకే దేశం ఒకే ఎన్నిక'ను అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్ లోని కేవడియాలో ఈరోజు నిర్వహించిన "జాతీయ ఐక్యతా దినోత్సవ" వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొని పటేల్‌కు నివాళులు అర్పించారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ (26 సెకన్లు)

---------------------------

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కృష్ణా, శ్రీసత్యసాయి, వైఎస్సార్, బాపట్ల, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించిన ఐక్యతా పరుగు, ఐక్యతా దినోత్సవంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో నిర్వహించిన ఐక్యతా పరుగులో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్

బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్...25 సెకన్లు

-------------------------

వరద కారణంగా దెబ్బతిన్న వాహనాలకు సంబంధించిన బీమా చెల్లింపు ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వరదలకు సంబంధించిన సహాయచర్యలు, బాధితులకు పరిహారంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులన్నీ వెంటనే పరిష్కరించి బాధితుల ఖాతాల్లో నగదును జమ చేయాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా లబ్ధిదారుల జాబితాలను గుర్తించాలని అధికారులకు సూచించారు.

-------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంపై మా ఆకాశవాణి శ్రీకాకుళం ప్రతినిధి ఎస్. జోగినాయుడు మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ (26 సెకన్లు)

-------------------------

దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటామని తెలిపారు.

-------------------------

దీపావళి, ఛత్ పూజ పండగల సందర్భంగా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 7 వేల 296 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 854 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక రైళ్లతో పాటుగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్రధాన రైల్వే స్టేషన్లలో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసింది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి తదితర స్టేషన్లలో అదనపు సిబ్బందిని కూడా నియమించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అలాగే ఈరోజు నుంచి నవంబరు 4 వరకు విశాఖ-దానాపూర్-విశాఖ మధ్య ప్రత్యేక రైలు, నవంబరు 15వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం విశాఖ-భువనేశ్వర్-విశాఖ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతోందని వాల్తేరు సీనియర్ డివిజనల్ రైల్వే మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో సమర్ధవంతంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వచ్చే నెల 8వ తేదిన గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగానికి చెందిన ఉద్యోగులతో కార్యశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

దీపావళి పండుగను పర్యావరణ హిత దీపావళిగా జరుపుకోవాలని గుంటూరు జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి నసీమా బేగం కోరారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ అనుమతించిన పర్యావరణహిత బాణాసంచాను వినియోగించాలని ఆమె పేర్కొంటూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

యువతను దేశాభివృద్ధిలో భాగం చేసేందుకు 'మేరా యువభారత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర అధికారి సుంకర రాము తెలిపారు. 'దీవాలి విత్ మై భారత్ – మేరా యువభారత్' కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం– ఎన్ఎస్ఎస్ సహకారంతో నిన్న విజయవాడలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు బజార్ పరిసరాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర అధికారి మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

దీపావళి సందర్భంగా తిరుమల వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు దీపావళి ఆస్థానాన్ని నిర్వహించింది. ఆలయంలోని బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానాన్ని అర్చకులు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వారు అభిముఖంగా వేంచేపు చేసి స్వామివారికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈరోజు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు.

---------------------------

భారత దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా పనిచేసిన ఇందిరా గాంధీ వర్ధంతి ఈ రోజు. 1917వ సంవత్సరంలో జన్మించిన ఆమె.. 17 ఏళ్ళపాటు భారత ప్రధానమంత్రిగా సేవలందించారు. 1984 అక్టోబర్ 31వ తేదీన ఆమె ... తన భద్రతా దళాల కాల్పులలో మరణించారు.

=====================